# మానస వేదిక



నాంపల్లి స్టేషన్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌ను చూడగానే నాలో దుఃఖం వెల్లువలా ప్రకాశించింది. ఇరవై ఏడేళ్ల నాకు ఏడుపు రావడమన్నది సామాన్యమైన విషయం కాదని నా నమ్మకం అందునా నా ఫ్రెండ్సందరూ ఫక్తు మెటీరియలిస్ట్‌గా అభివర్ణించే నాకు దుఃఖం రావడమన్నది గొప్ప విషయమేమరి.

"మద్రాసు ఇంతకు ముందు వెళ్లావా?" పదిహేను నిముషాల మౌనం తర్వాత అడిగాడు మూర్తి.

"లేదు ఇదే ఫస్ట్ టైం" నాకు తెలుసు నా గొంతు వణుకుతోందని.

మళ్లీ మౌనం మా ఇద్దరి మధ్య.

మా యిద్దర్నీ పట్టించుకోకుండా ఎవరి హడావుడిలో వాళ్లున్నారు.

పక్కనే కాఫీ బండి ఆగగానే చెరోగ్లాసు తీసుకున్నాం.

"లీవ్ ఎన్నాళ్లు పెట్టుకోవచ్చు?" ట్రైన్ ఎక్కించడానికి వచ్చినవాళ్లు ఆప్తులయితే మాటలు రావన్నది నాకప్పుడే అర్థమైంది.

అందుకే మూర్తి ఆ ప్రశ్నడిగిన ఐదు నిమిషాలకి జవాబిచ్చాను.

"మానస వస్తానందా?" ఎక్కడో మిణుకుమంటున్న ఆశతో అడిగాను మూర్తిని.

"నువ్వు మద్రాసు వెళ్తున్నట్టు తనకు తెలీదు" క్లుప్తంగా చెప్పాడు మూర్తి.

"నేను మొన్న ఫోన్ చేశాను" చెప్పాన్నేను.

"ఏమని?"

"అదే మద్రాసు ట్రాన్స్‌ఫర్ అయినట్టు"

"ఏమంది?"

"మామూలే..."

ట్రైన్ కదలడానికి సిద్ధమయింది. గార్డ్ పచ్చజండా ఊపుతూ హడావుడిపడుతున్నాడు.

అయిపోయింది—

7/7/91

—రవి కొలికపూడి

ఓ నిరుద్యోగిగా ఈ హైదరాబాద్ వచ్చి పస్తులతో, అయినవారి సాధింపులతో విసిగి, చివరకు ఓ మంచి ఉద్యోగం దొరికిందన్న సంతోషం ఎక్కువకాలం నిలవకుండానే మళ్లీ ఈ ట్రాన్స్‌ఫర్—

మెస్‌వాడితో జోకులు, లంచ్‌కి డబ్బుల్లేక ఇరానీ కేఫ్‌లో సమోసాలూ, ఐదురూపాయల్ని ఓ అద్భుతంలో చూసిన రోజులూ, రూంరెంట్ కట్టకపోతే రావద్దన్న ఓనర్‌తో పోట్లాడి రైల్వేస్టేషన్‌లో పడుకున్న రోజులూ— ఇవన్నీ ఒక ఎత్తయితే మానస స్నేహం మరో ఎత్తు— ఎటువంటి ప్రత్యేకత లేని నన్ను ప్రేమించి, ఆప్యాయత కరువైన నాకు తన ప్రేమతో ఓ కొత్త జీవితాన్ని ప్రసాదించింది.

విధి అని నేను ఆత్మవంచన చేసుకోను గానీ— మానస కూడా సాధారణమైన ఆడపిల్లేనని నాకు ఆమె పెళ్లి నిశ్చయమైన తర్వాత తెలిసింది. వంద ప్రేమ కథల్లో తొంభైతొమ్మిది ప్రేమ కథలు నా కథలానే వుంటాయి. అందుకే నాకూ, నా ప్రేమకీ ఏ ప్రత్యేకతా లేదు.

బట్ ఆమెకు పెళ్లయిన తర్వాత రోజు నుండీ నేను చాలా స్వేచ్ఛగా ఫీలయ్యాను. ఇప్పుడు నా గురించి ఆలోచించే ప్రాణి లేదు. ఓవేళ ఉన్నా డబ్బుతో కొలుచుకునే ప్రేమలు వారివి. నేను ఎవరికోసం ఆలోచించక్కర్లేదు. నేనంత చెడ్డవాడినైనా ఈ సమాజం నన్ను పట్టించుకోదు.

"ఎక్కు సూరీ..." కదుల్తున్న ట్రైన్‌ని నేను గమనించలేదు.

ఒక్క అంగలో ఎక్కి మూర్తివైపు చూశాను.

నవ్వుతున్నాడు! ఆ నవ్వుకి అర్థం తెలిసిన నాకు కోపం వచ్చినా కంట్రోల్ చేసుకున్నాను.

కంపార్ట్‌మెంట్‌తోపాటు నడుస్తూ—

"ఉత్తరం రాయి సూరీ... జాగ్రత్త... డబ్బవసరం అయితే రాయి టి.ఎమ్.ఓ చేస్తాను. మానసని మర్చిపో... అక్కడ వారిక్కూడా నువ్వు ప్రశ్నార్థకంగా మిగలడం నాకిష్టముండదు. అవునూ..." ఇక మూర్తి మాటలు వినిపించలేదు. ట్రైన్ వేగం అందుకుంది.

చేయి ఊపుతూ నిలబడ్డాడు మూర్తి. నేనూ చేయి ఊపుతూ కళ్లజోడుతో సైగ చేశాను. మూర్తి ఆ క్షణంలో నావైపు చూసిన చూపు ఇప్పటికీ మర్చిపోలేను.

కళ్లజోడు సైగ చేయగానే మానస అని తెలుసు మూర్తికి. మానస తలనొప్పికి జోడు పెట్టుకుంటుంది.

కంపార్ట్‌మెంట్‌లో కూర్చున్న నాకు మనసంతా ఖాళీ అయిన ఫీలింగ్. సరిగ్గా ఇది జరిగి నాలుగు సంవత్సరాలయింది.

ప్రస్తుతం నాకు అందమైన భార్య. ఏడాదిపాప. నా భార్య అందం గురించి నేను ఎప్పుడూ గర్వపడలేదు. కానీ— నేను తప్ప మిగిలిన వారంతా నా భార్య విషయంలో నాపైన అసూయ పడేవారే. నిజానికి రుక్మిణి (నాభార్య) అందంతోపాటు అణుకువ కూడా పుణికిపుచ్చుకుంది. నా మాటంటే ఎనలేని గౌరవం ఆమెకు కానీ నా మనసంతా మానసతో నిండివుంటే ఇక రుక్మిణి విషయం ఆలోచించడానికి టైమెక్కడ? మద్రాసులో ఈ నాలుగేళ్లు చాలా హాయిగా గడచిపోయింది. మూర్తి ఈ నాలుగేళ్లలో పదిహేను ఉత్తరాలు రాసివుంటాడు. నా పెళ్లికొచ్చి రుక్మిణికి గోల్డ్‌చైన్ ప్రెజంట్ చేసాడు. ఆ రాత్రే తిరుగుప్రయాణమైన మూర్తినాతో "మానసకన్నా వందరెట్లు మంచితనం, అందం గల అమ్మాయిని సంపాదించావు. ఇక నుంచైనా సుఖపడు సూరీ..." అని సెంట్రల్ స్టేషన్‌లో చెప్తుంటే నా చేతకానితనం మీద నాకు అసహ్యమేసింది. నాకు తెలుసు మర్చిపోవడమన్నది అసాధ్యమని. కానీ వీళ్లంతా నా మంచికే చెప్తున్నారని కూడా తెలుసు. ఈ రెండింటి నడుమ నేను క్రష్ అవుతుంటే మూర్తి పడే బాధని నేను భరించలేకపోతున్నాను.

అప్పుడప్పుడూ నా అంత 'హిపోక్రాట్' మరెవడూ వుండడనిపిస్తోంది.

రుక్మిణికి మానస విషయమంతా చెప్పేశాను. ఒక్క మాట మాట్లాడలేదామె. రుక్మిణికి నెల తప్పిందన్న విషయం నాకు తెలిసిన మరుక్షణం నుంచీ నా ఆరాటం ఇంతా అంతా కాదు. మద్రాసులోవున్న ప్రతి డాక్టర్‌నీ కలిశాను— పుట్టబోయే బిడ్డ ఆడా మగా అని తెలుసుకోడానికి 'ఆడపిల్ల' అని తెలిసిన తర్వాత నాకు తెలియకుండానే రుక్మిణిని మొదటిసారిగా మనస్ఫూర్తిగా ముద్దుపెట్టుకున్నాను.

నా ఆనందం ఎంతో సేపు నిలవలేదు.

రుక్మిణి నా వైపు జాలిగా చూస్తూ "పాప పేరు మానస అని పెడదాం" అంది.

నాలో మిసైల్ దూసుకుపోయిన స్థితి. అంటే నా తపన, ఆరాటం తను కనిపెట్టేసిందన్నమాట—

సిగ్గుతో తలదించుకున్నాను.

"మరో విషయం— ఇక నేను ఆపరేషన్ చేయించుకుంటాను. ప్లీజ్ కాదనకండి పాపకి ముద్దుపేరు కూడా మానసనే పిలుద్దాం" ఒక్కోమాట చాలా నెమ్మదిగా చెప్తున్నా. నాకు మాత్రం బాణాల్లో గుచ్చుకున్నాయి.

ఈ గిల్టినెస్‌ని మానస అవలీలగా డామినేట్ చేసి నా చేత సరేననిపించింది.

పాపని మానస అని పిలిచిన ప్రతిక్షణం నేను అనుభవించే చిత్రవధ చెప్తే అర్థమయ్యేది కాదు.

ఇటు రుక్మిణికి దగ్గరకాలేక అటు మానస జ్ఞాపకాలకు దూరం కాలేక నరకం అనుభవిస్తున్నాను. అసలీ కాలంలో రుక్మిణిలాంటి సహనవతులున్నారంటే ఆశ్చర్యమే మరి.

పెళ్లయిన దగ్గర్నుండీ ఇంత వరకూ నా అంతట నేనుగా ఆమె మీద చేయి వేసి ఎరుగను. తనే ఏ ఇరవై రోజులకో నన్ను ప్రోత్సాహించేది. ఇది మా ఇరువురి మధ్యనున్న విషయమైనా ఎందుకు చెప్తున్నానంటే మార్కెట్లోవున్న ప్రతి మ్యాగజైన్లలోనూ నా భర్త అలాంటివాడనీ, ఇలాంటి వాడనీ ఓ సెక్స్ డాక్టర్ దగ్గర వాపోయే స్త్రీలను చూసిన నాకు రుక్మిణి సహనం చాలా ఉన్నతంగా కనిపించడంలో తప్పులేదేమో—

మళ్లీ ఇంతకాలానికి తిరిగి హైదరాబాద్ వస్తున్న నాకు ఎందుకో బాధగా ఉంది. అనవసరంగా ట్రాన్స్‌ఫర్‌కి ప్రయత్నించానేమోననిపించింది నాకు.

ట్రైన్ విజయవాడలో ఆగింది. టైం చూస్తే ఒంటిగంటవుతోంది. కంపార్ట్‌మెంట్‌లో నేను తప్ప దాదాపు అందరూ నిద్రలోవున్నారు. ట్రైన్ ఆగిన రెండు మూడు నిముషాలకు ఒక్కొక్కరే లేచి కిందకి దిగుతున్నారు.

పాపని ఒళ్లో పడుకోబెట్టుకొని నా భుజంపై తలవాల్చి నిద్రపోతున్న రుక్మిణిని లేపి నీళ్లు తాగుతావా అని అడిగాను. దానికి సమాధానం చెప్పకుండా "నాకెందుకో మద్రాసే బాగుందండీ... నా పుట్టినిల్లు హైదరాబాదయినా, కానీ నాకు మళ్లీ హైదరాబాద్ వస్తుంటే తెలీని టెన్షన్ ఫీలవుతున్నాను. మీకు హాపీగానే వుంది కదూ" అంది రుక్మిణి. ఆఖరిమాట ఆమె సహజంగా అన్నా, సెటేర్‌లా అనిపించింది నాకు. నేను లేచి మౌనంగా ప్లాట్‌ఫాంపై నిలుచున్నాను. ప్లాట్‌ఫాంమీద సిమెంట్ బెంచీపై కూర్చున్న భార్యాభర్తల్ని చూడగానే అప్రయత్నంగా వారివేపు అడుగులేసాను. నేను డిగ్రీ చదివే రోజుల్లో నా క్లాస్‌మెట్ సత్యభామ. తన భర్తతో కబుర్లు చెప్తూ కూర్చుందక్కడ.

"హలో సత్యా... బాగున్నారా?" ఆప్యాయంగా పలకరించాను.

ఆమె వినయంగా లేచి తన భర్తని పరిచయం చేసింది. చాలా విషయాలడిగింది. ఆమెలోని పిరికితనం ఇంకా పోలేదనిపించింది నాకు.

వస్తానని చెప్పి కంపార్ట్‌మెంట్ ఎక్కాను. హైదరాబాద్ చేరేసరికి ఉదయం ఆరు గంటలయింది. నాంపల్లి స్టేషన్‌లో ఎటువంటి మార్పూలేదు.

లగేజ్ దింపి ప్లాట్‌ఫాంపై నిలబడిన మాకు అంత దూరాన మూర్తి వేగంగా వస్తూ కనపడ్డాడు. నా కళ్లు ఆనందంతో మెరిసాయి. ఎంత కాలమైంది మూర్తిని చూసి— మనిషిలో ఏ మార్పూలేదు గెడ్డం పెంచాడంతే. మా దగ్గరగా వచ్చి పలకరింపులయ్యాక పాపనెత్తుకొని—

'పేరేం పెట్టారమ్మా' అన్నాడు రుక్మిణితో—

చెప్పిందామె.

మూర్తి నావేపు చూసిన చూపు నాకు విరాకు కలిగించింది.

"ఇది నా కూతురు, నా ఇష్టం. నాకు తోచిన పేరు పెట్టుకుంటాను. మీరంతా ఎవరు?' అని మనసులో కసురుకున్నాను.

పక్క ప్లాట్‌ఫాంపై తిరుపతి వెళ్లే ట్రైన్ అప్పుడే వచ్చి ఆగింది.

మౌనంగా నడుస్తున్నాం ముగ్గురం.

ముందు నడుస్తున్న మూర్తి హఠాత్తుగా ఎంట్రన్స్‌లో ఆగిపోగానే మేమిద్దరం మూర్తితో మాట్లాడుతున్న వ్యక్తివైపు చూసాం. కొత్త వందనోటులావున్న ఓ వ్యక్తితో మాట్లాడుతున్న మూర్తి నావైపు తిరిగి 'కృష్ణప్రసాద్' అని అతని పేరు చెప్పి నన్ను పరిచయం చేసాడు.

"పోదాం" అన్నాను మూర్తితో.

'ఒన్‌మినిట్' అని అక్కడే అతనితో అసందర్భంగా మాట్లాడుతున్నాడు. నాకు చిరాగ్గా వుంది. ఇంతలో భుజానికి బ్యాగ్ తగిలించుకొని హైహీల్స్ చెప్పులతో శబ్దం వచ్చేలా నడుస్తూ మా దగ్గరకొచ్చినామెను మా దగ్గర కొచ్చేవరకు గుర్తు పట్టలేదు—

ఆమె మానస!

నా గుండె గొంతుకలోకి వచ్చి మాట రావడం లేదు.

మానస నా వైపు తిరిగి—

"బాగున్నారా సూరీ? వెరీగుడ్ సెలక్షన్..." అంది రుక్మిణీవైపు చూసి

మానసలో చాలా మార్పొచ్చింది. నాకెందుకో ఈ సంఘటన నమ్మబుద్ధి కావట్లేదు. ఇలా జరక్కుండా ఉంటే బాగుండుననిపించింది. మూర్తి తన భుజానవున్న పాపని చూపెడుతూ "దీని పేరేంటో తెల్సా — నీపేరే.." అన్నాడు మానసని చూస్తూ. ఆమె నవ్విందంతే—

మానస భర్త మాత్రం "ఈజిట్" అంటూ పాపనెత్తుకోబోతుంటే...

"మీదసలే వైట్ షర్టు మహానుభావా... ఇక్కడ పెద్ద మానసను నేనున్నానుగా" అంది కొంచెం విసుగ్గా...

మూర్తి నా వైపు చూసి విజయగర్వంతో నవ్వాడు.

అప్రయత్నంగా నా భుజంమీదపడిన చల్లని చేతివైపు చూశాను—

అది నా భార్య రుక్మిణి చేయి.